

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం

07 నవంబర్ 2025 పేజీలు : 08


మాలేపాటి సుబ్బానాయుడు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ఆ కుటుంబం రాజకీయంగా కూడా ఎదిగేందుకు వెన్నుదన్నుగా నిలుస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. గురువారం ఉదయం దగదర్తిలోని మాలేపాటి సుబ్బానాయుడు నివాసానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. భార్య మాలేపాటి భవాని, కుమారుడు లోకేష్, ఇతర కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్నివిధాల తోడుగా ఉంటామని ధైర్యం చెప్పారు. మాలేపాటి సుబ్బానాయుడు, మాలేపాటి భానుచందర్ నాయుడు చిత్రపటాలకు మంత్రి నారా లోకేష్, జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.







## మాలేపాటి కుటుంబం రాజకీయంగా ఎదిగేందుకు

# అండగా ఉంటాం

### రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖల మంత్రి నారా లోకేష్

**కావలి, మేజర్‌న్యూస్ :**

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ పాత్రికేయులతో మాట్లాడుతూ.. మాలేపాటి సుబ్బానాయుడు, భానుచందర్ వంటి గట్టి కార్యకర్తలను కోల్పోవడం బాధాకారమన్నారు. మండల పార్టీ అధ్యక్షుడుగా, రాష్ట్ర ఆగ్రోస్ ఇండిస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా, నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాలేపాటి సుబ్బానాయుడు పార్టీ పట్ల నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేశారన్నారు. తాను రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి సుబ్బానాయుడుతో మంచి పరిచయం ఉందన్న లోకేష్, కేబినెట్ మీటింగ్ అయిన వెంటనే సుబ్బానాయుడు అనారోగ్యానికి గురైన విషయం తెలుసుకుని, ఆసుపత్రికి వెళ్లి పరామర్శించానని, మంచి వైద్యం అందించాలని వైద్యులకు సూచించినట్లు చెప్పారు. దురదృష్టవశాత్తు సుబ్బానాయుడు మృతి చెందడం బాధాకరమని, పార్టీకి తీరని లోటుగా లోకేష్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బలమైన నాయకుడిని కోల్పోయామన్నారు. యువగళం పాదయాత్రలో తనతో పాటు ఐదు రోజులు దగ్గరుండి ముందుకు నడిచాడని చెప్పారు. కార్యకర్తలకు -మిగతా 2లో



## పీఎంఎస్ఎస్ పథకాన్ని

# సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల

మాజీ సైనికులు, మాజీ కోస్ట్ గార్డ్ సిబ్బంది, వారి వితంతువుల పిల్లలకు ఉన్నత వృత్తి విద్య కోసం ఆర్థిక సహాయం అందించే ప్రధాన మంత్రి స్కాలర్ షిప్ పథకంను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు.



వివరాలు 2లో

## ప్రజాసంకల్ప యాత్ర..

# ఘనంగా వేడుకలు



వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.

వివరాలు 02లో

## అపురూప అద్వితీయం..

# కార్తీక దీపోత్సవం



- శంఖనాదాలు, భక్తుల హరనాదాలతో ప్రతిధ్వనించిన వీఆర్సీ మైదానం
- శ్రీ రామానంద భారతి స్వాముల వారిచే లింగోద్భవం

08 పేజీలో

# ప్రజాసంకల్ప యాత్ర.. ఘనంగా వేడుకలు




**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర ప్రారంభించి 8 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి.. వైసీపీ నేతలతో కలిసి నెల్లూరు సిటీ ఇన్చార్జి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా సంకల్ప యాత్రను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి నేటికి 8 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా వైసీపీ నెల్లూరు జిల్లా కార్యాలయంలో వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 2014-19 మధ్యకాలంలో రాష్ట్రంలో రైతుల ఇబ్బందులు, పేదరికం నిరుద్యోగం లాంటి పరిస్థితులు దృష్ట్యా వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టారని తెలిపారు. ప్రజాసంకల్ప యాత్రలో, ఉద్యోగులు, నిరుద్యోగులు రైతులు, మహిళలు, విద్యార్థులు, వ్యాపారస్తులు ఇలా అనేక వర్గాల ప్రజలను కలిసి వారి అభిప్రాయాలు సమస్యలు తెలుసుకుని జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక, కోవిడ్ ఉన్నప్పటికీ మూడేళ్ల సమయంలోనే 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగన్మోహన్ రెడ్డిదన్నారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడి వారు మరింత వృద్ధిలోకి రావడం జరిగిందన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో.. ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవస్థలన్ని విచ్చిన్నమై.. శాంతిభద్రతులకు విఘాతం కలిగిస్తూ.. రక్తపాతం కళ్ళ చూసేలా దుర్మార్గపు పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా జగన్మోహన్ రెడ్డి.. మరోసారి పాదయాత్ర చేపట్టి.. ఇప్పుడున్న పరిస్థితులన్నిటిని చక్కదిద్దేలా 2029లో ఈ రాష్ట్ర ప్రజలకు మంచి అందించాలని కోరారు. 2029లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి.. వైయస్ జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యి జనరంజక పాలన సాగిస్తారని ప్రజలందరూ అభిప్రాయపడుతున్నారన్నారు. ఆరోజు పాదయాత్రకు శ్రీకారం చుట్టిన వైఎస్ రాజశేఖర్ రెడ్డి.. దాన్ని కొనసాగిస్తూ.. జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి 8 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాలేపాటి కుటుంబం రాజకీయంగా ఎదిగేందుకు అండగా ఉంటాం

*(మొదటి పేజీ తరువాయి)*

టిడిపి ఎప్పుడూ అండగా ఉంటుందని లోకేష్ గుర్తు చేశారు. కార్యకర్తలకు సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. 135 కోట్ల రూపాయలు కార్యకర్తల సంక్షేమానికి నిధి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మాలేపాటి కుటుంబానికి అండగా మాత్రమే కాదు, రాజకీయంగా పైకి తీసుకొచ్చేందుకు వ్యక్తిగతంగా తోడుగా ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, కాకర్ల సురేష్, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.









## మంత్రి నారా లోకేష్ పర్యటన దృశ్యాలు

గురువారం ఉదయం దగదర్తిలోని మాలేపాటి సుబ్బానాయుడు నివాసానికి విచ్చేసిన మంత్రి నారా లోకేష్‌కు స్థానిక ప్రజలు నీరాజనాలు పలికారు. యువనేత, మంత్రి లోకేష్‌తో కరచాలనం కోసం అక్కడి ప్రజలు ఎగబడ్డారు. మహిళలు హారతులు పట్టారు. అలాగే సమస్యలపై పలువురు వినతి పత్రాలు అందజేశారు. మంత్రి లోకేష్ ప్రజలకు అభివాదం చేస్తూ.. ముందుకెళ్లారు. అనంతరం మాలేపాటి కుటుంబాన్ని పరామర్శించారు.







# కోవూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ




**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** కోవూరు పోలీస్ స్టేషన్‌ను నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ కోవూరు సర్కిల్ ఆఫీసు, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటి పచ్చదనం పెంచాలని సూచించారు. అనంతరం స్టేషన్ మ్యాప్, సీసీ కెమెరాలు పరిశీలించి స్టేషన్ పరిధిలో ఉన్న పరిస్థితులు, నేర ప్రాంతాలపై ఆరా తీశారు. అదేవిధంగా పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెట్లు, పాత నేరస్తులపై నిఘ పెంచాలని, ప్రతి ఆదివారం వారికి తప్పక కౌన్సిలింగ్ ఇవ్వాలని, క్రిమినల్ చర్యలకు పాల్పడిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకుంటూ ఓపిగ్గా ఉండాలని, ఫిర్యాదుదారులు వచ్చిన వెంటనే వారిని పలకరించి, నీరు వంటి కనీస సౌకర్యాలు అందించి వారి సమస్యను ఓపికగా విని ధైర్యం నింపి భరోసా కల్పించాలని, ఫిర్యాదుదారులను మన కుటుంబంలో ఒక సభ్యులుగా భావించి అక్కున చేర్చుకోవాలని అంకితభావంతో పని చేయాలని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ వ్యవస్థను ముమ్మరం చేయాలని రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, హైవేపై ప్రమాదాలను తగ్గించేవిధంగా సైన్‌బోర్డ్సు ఏర్పాటు చేయాలని ఎస్పీ తెలియజేశారు. పోలీస్‌స్టేషన్ సిబ్బంది క్షేమాలు అడిగి తెలుసుకుని, తమకు ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అని ఆరా తీసి, వారి గ్రీవెన్స్‌ను అడిగి వెంటనే పరిష్కరించేలా అధికారులను ఆదేశించారు.

# పీఎంఎస్ఎస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** మాజీ సైనికులు, మాజీ కోస్ట్ గార్డ్ సిబ్బంది, వారి వితంతువుల పిల్లలకు ఉన్నత వృత్తి విద్య కోసం ఆర్థిక సహాయం అందించే ప్రధాన మంత్రి స్కాలర్‌షిప్ పథకంను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు. గురువారం జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.హరికృష్ణ ఆధ్వర్యంలో జిల్లా సైనిక్ బోర్డు సభ్యులు జిల్లా కలెక్టర్, జిల్లా సైనిక్ బోర్డు చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఉన్నత విద్య అభ్యసించే మాజీ సైనికుల పిల్లలకు ప్రధానమంత్రి స్కాలర్షిప్ పథకంలో భాగంగా బాలురకు నెలకు రూ.2,500, బాలికలకు రూ.3 వేలు అందిస్తారన్నారు. ఇందులో నమోదు చేసుకునేందుకు వారికి అవగాహన కలిగించాలన్నారు. నవంబర్ 30లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉందన్నారు. అదేవిధంగా కేంద్రీయ సైనిక్ బోర్డు, రాష్ట్రీయ సైనిక్ బోర్డుల ద్వారా అందించే సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్క మాజీ సైనిక కుటుంబాలకు అందేవిధంగా చర్యలను తీసుకోవాలన్నారు. అలాగే జిల్లాలోని సీతారామపురానికి చెందిన జమ్మూ కాశ్మీర్‌లోని లైన్ అఫ్ కంట్రోల్‌లో మరణించిన మండ్ల ప్రసాద్‌కి సంబంధించిన ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబ సభ్యుల కారుణ్య నియామకం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను త్వరితగతిన అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌ను కలసిన వారిలో జిల్లా సైనిక్ బోర్డు సభ్యులు మాజీ వింగ్ కామాండర్ వల్లూరు శ్యాంప్రసాద్, మాజీ హవాల్దార్ కారేటి కళాధర్, కార్యదర్శి, జిల్లా సైనిక సంక్షేమ అధికారి హరికృష్ణ, మాజీ సైనిక అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ గడ్డం రత్నయ్య, రమేష్ తదితరులు ఉన్నారు.

# బిరదవోలులో రైతులకు యూరియా పంపిణీ

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని బిరదవోలు రైతు సేవా కేంద్రం పరిధిలోని రైతులకు అధికారులు, టీడీపీ నాయకులు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల తెలుగు యువత అధ్యక్షులు వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. బిరదవోలు సచివాలయం పరిధిలోని పార్లపల్లి, చెర్లోపల్లి, బిరదవోలు, కళ్యాణపురం, ముత్యాలపేట, బ్రాహ్మణపల్లి గ్రామాల రైతులకు 400 బస్తాలు యూరియా పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఒక్కో బస్తా రూ.266లు చొప్పున ఇవ్వడం జరుగుతోందన్నారు. బిరదవోలు సచివాలయంకు సంబంధించి మరో రెండు లోడ్ యూరియా రానున్నట్లు తెలిపారు. ఈ వ్యవసాయ సీజన్‌కు సంబంధించి మండలంలో యూరియా పుష్కలంగా అందుబాటులో ఉందని రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. ఒక్కో ఎకరాకు మూడు బస్తాల చొప్పున యూరియా రైతులకు అందించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించి రైతులకు యూరియా కార్డులను అందజేయడం జరిగిందన్నారు. సాగుకు ముందే యూరియా అందుబాటులో ఉండేలా చూడడమే కాకుండా అహర్నిశలు రైతుల సంక్షేమం కోసం పాటుపడుతున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి



ఈ సందర్భంగా రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సంఘం అధ్యక్షుడు యత్తపు వెంకట రెడ్డి, పార్లపల్లి ఉపసర్పంచ్ అన్నలూరు చెన్నకృష్ణమ నాయుడు, బిరదోలు, పార్లపల్లి పంచాయతీ టిడిపి నాయకులు వెన్నపూస రమణారెడ్డి, పోసిన చిన్నబ్బయ్య, బడుగు సూర్య నారాయణ, కోటంరెడ్డి సాయిరెడ్డి, వెన్నపూస కృష్ణారెడ్డి, గూడూరు శ్రీనివాసులు, హార్టికల్చర్ అసిస్టెంట్ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ట్రిక్ క్యాన్సర్‌పై అవగాహనకు మెడికవర్ హాస్పిటల్స్ పిలుపు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** మెడికవర్ హాస్పిటల్స్ నవంబర్ నెలను ప్రపంచవ్యాప్తంగా గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అవగాహన నెలగా జరుపుకుంటూ భారతదేశ ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన పెంపొందించేందుకు ముందుకు వచ్చింది. ప్రస్తుత జీవనశైలిలో మార్పులు, ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ ఆహారాల అధిక వినియోగం, మసాలా పదార్థాల వాడకం, పొగ త్రాగడం, మద్యపానం వంటి కారణాలతో గ్యాస్ట్రిక్ క్యాన్సర్ కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. తాజా భారతీయ గణాంకాల ప్రకారం, గ్యాస్ట్రిక్ క్యాన్సర్ దేశంలో అత్యంత సాధారణమైన ఐదు క్యాన్సర్లలో ఒకటి. ముఖ్యంగా దక్షిణ, ఈశాన్య భారతదేశ ప్రాంతాల్లో ఈ వ్యాధి అధికంగా కనిపిస్తోంది. ప్రారంభ దశలో లక్షణాలు సాధారణంగా గుర్తించలేకపోవడం వలన, ఎక్కువమంది రోగులు చివరి దశల్లో మాత్రమే వైద్యుడిని సంప్రదిస్తున్నారు. అజీర్ణం, కడుపు ఉబ్బరం, భోజనం చేసిన తర్వాత నిండిన భావన, నిస్సత్తువ, వాంతులు, రక్తస్రావం లేదా ఆకలి తగ్గడం వంటి లక్షణాలు నిర్లక్ష్యం



చేయరానివి. ఆలస్య దశ నిర్ధారణను తగ్గించి, ముందస్తు గుర్తింపుతో చికిత్స ఫలితాలను మెరుగుపరచడం' అని మెడికవర్ హాస్పిటల్స్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, జీఐ ఆంకాలజిస్ట్ డాక్టర్ జి.రంగారామన్ తెలిపారు. 'ప్రత్యేకంగా 40 సంవత్సరాల వయస్సు దాటిన వారు లేదా కుటుంబ చరిత్ర ఉన్నవారు ఎండోస్కోపిక్ స్క్రీనింగ్ చేయించుకోవడం ద్వారా వ్యాధిని తొలిదశలో గుర్తించి సమర్థవంతంగా చికిత్స పొందవచ్చు' అని ఆయన పేర్కొన్నారు. మెడికవర్ హాస్పిటల్స్‌లో ఆధునాతన ఎండోస్కోపిక్ సాంకేతికత, నిపుణులైన ఆంకాలజిస్టుల బృందం, బహుళ శాస్త్ర విభాగాల సమన్వయంతో గ్యాస్ట్రిక్ క్యాన్సర్ నిర్ధారణ, శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్ చికిత్సలు సమర్థవంతంగా నిర్వహించబడుతున్నాయి. ఆసుపత్రి ప్రజల్లో ఆరోగ్యవంతమైన ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం నివారణ, క్రమపద్ధతిలో ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతపై అవగాహన పెంచుతోంది.

# ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై కళాజాత

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని బొమ్మరాజు చెరువు గ్రామంలో బుధవారం ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యతపై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు చీఫ్ మేనేజర్ సిహెచ్ వి.సుబ్బారెడ్డి అసిస్టెంట్ మేనేజర్ బి.హరీష్ సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు సీఈఓ మేకల రమణయ్య యాదవ్ డైరెక్టర్ గని శ్రీనివాస నాయుడు కార్యక్రమానికి విచ్చేసి వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఖాతాదారులకు శ్రేయోభిలాషులకు తమ బ్యాంకు ద్వారా అందిస్తున్నటువంటి ప్రత్యేక డిపాజిట్ పథకాలు వివరించారు. బ్యాంకు ద్వారా అతి తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నామన్నారు 0 బ్యాలెన్స్ ఖాతాలను తేరుస్తున్నామని తెలిపారు. డీబీటీ రూపే కార్డు సౌకర్యం ఉందన్నారు. రూపే కార్డు ద్వారా ప్రమాద భీమా లక్ష నుండి 2లక్షలు పొందవచ్చు అంతేకాకుండా సామాజిక భద్రత పథకాలు అయినటువంటి ప్రధానమంత్రి జీవనజ్యోతి భీమా యోజన ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన గురించి వివరించారు. అత్యధిక వడ్డీ అందిస్తున్న బ్యాంక్ సెంట్రల్ బ్యాంక్ అన్నారు. అలాగే బంగారు నగల పై



రుణాలు గృహ నిర్మాణం, గృహ తనకాపై రుణాలు వ్యవసాయ రుణాలు పంట రుణాలు స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు కర్షక మిత్ర విద్యా రుణాలు ద్విచక్ర, కార్లు రుణాలు సూర్య ఘర్ ఏర్పాటు రుణాలు ఎస్‌హెచ్‌జి రుణాలు జివిఎల్‌జి రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గ్రామీణ ప్రాంత రైతులందరూ వ్యాపారులు సద్వినియోగపరచు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఎం.శ్రీనివాసులురెడ్డి, కళాజాత కళాకారులు తదితరులు ఉన్నారు.

# ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని మంత్రికి వినతి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విస్తీర్ణంలో పెద్దదిగా ఉండి, మూడు రెవెన్యూ డివిజన్లుగా విభజింప బడివున్న ఉదయగిరి నియోజక వర్గాన్ని ఉదయగిరి కేంద్రంగా ఒక రెవెన్యూ డివిజనుగా ఏర్పాటు చేయాలని కోరుతూ యుడిఎఫ్ ప్రతినిధులు మంత్రి నారాలోకేష్‌ను కోరారు. గురువారం నెల్లూరు జిల్లాలోని దగదర్తికి వచ్చిన సందర్భంగా వారు మంత్రిని కలిసి వినతిపత్రం అందించారు. వంద కి.మీ. మేరకు విస్తరించి ఉన్న ఉదయగిరి నియోజక వర్గంలోని ఎనిమిది మండలాలను కలిపి ఒక రెవెన్యూ డివిజన్ చేసేందుకు ఉదయగిరికి అన్ని అర్హతలున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఆత్మకూరు కావలి కందుకూరు రెవెన్యూ డివిజన్లలో ఉదయగిరి నియోజకవర్గాన్ని మూడు ముక్కలుగా విభజించి ఉన్నారన్నారు. దశాబ్దాలుగా వెనకబడిన ఉదయగిరి ప్రాంతాన్ని గత ప్రభుత్వం మరింత వెనక్కు నెట్టిందన్నారు. జిల్లాల పునర్విభజనలో ఉదయగిరి జిల్లా ఉద్యమాన్ని లెక్క చేయక నియోజకవర్గంలోని మండలాలను చెల్లాచెదురు చేసి అన్యాయం చేసిందన్నారు. డివిజన్ల పునర్విభజనలోనైనా గత ఆరేళ్లు జరిగిన ఉద్యమాన్ని గుర్తించి ఉదయగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను యుడిఎఫ్ ప్రతినిధులు కలిసి మరొక వినతిపత్రాన్ని ఎమ్మెల్యే ద్వారా మంత్రికి అందజేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి రెవెన్యూ డివిజన్ అవశ్యకతను ఎమ్మెల్యే మంత్రికి వివరించారు. మంత్రిని కలసిన ఉదయగిరి డెవలప్మెంట్ ఫోరం ప్రతినిధులలో శ్రీరామచంద్రమూర్తి, ఎండి ఖాజ, శ్రీను ఉన్నారు.

# కాంట్రాక్టర్లపై పోలీసులకు ఫిర్యాదు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వం మంజూరు చేసిన పక్కాగృహాలను నిర్మించకుండా నిధులు స్వాహా చేసిన కాంట్రాక్టర్లపై లబ్ధిదారులు గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. మండలంలోని కొండాయపాళెం పంచాయతీ గంగిరెడ్డిపల్లి వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్లో 2023లో హౌసింగ్ శాఖాధికారులు, సచివాలయ ఇంనీరింగ్ అసిస్టెంట్ సమక్షంలో తీర్మానం చేసి గృహ నిర్మాణాలు చేసేందుకు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు. దేవండ్ల పిచ్చయ్యలకు ఒప్పందం మేరకు అప్పగించడం జరిగిందన్నారు. అయితే కాంట్రాక్టర్లు ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులను వారి ఖాతాలో వేసుకోని నాసిరకంగా నిర్మాణాలు చేయడంతోపాటు పూర్తి చేయకుండా లబ్ధిదారులను మోసగించి తప్పించుకుని తిర గుతున్నారన్నారు. కావున వారిపై చర్యలు చేపట్టి మాకు న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఇన్చార్జి డీఈ, ఏఈలు పీరాన్, షరీప్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఆది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాకర్ల సునీల్ జన్మదిన వేడుకలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోదరుడు, నియోజకవర్గ టీడీపీ నాయకుడు కాకర్ల సునీల్ జన్మదిన వేడుకలను గురువారం టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకర్ల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 400మంది విద్యార్థులకు భోజన ప్లేట్లు పంపిణీ చేశారు. అలాగే అనాథశ్రమంలో కేక్ కట్ చేసి చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందజేస్తున్న కాకర్ల సునీల్ భవిష్యత్తులో ఉన్నత పదవులు అధిరోహించి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహా, ఉప్పుటూరి పెదవెంకటయ్య, అనంతశెట్టి ఏడుకొండలు, శివకృష్ణ నాగేశ్వరరావు, ప్రవీణ్ కుమార్, అంకబాబు, శ్రీధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్య విద్యా సంస్థలలో రక్తదాన శిబిరం




**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్ పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినాన్ని పురస్కరించుకుని నెల్లూరు ధనలక్ష్మీపురంలో గురువారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పలమనాలజిస్ట్ డాక్టర్ పోకల రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీ చైతన్య సంస్థలు లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకొని వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారన్నారు. తాను కూడా శ్రీచైతన్య సంస్థలో విద్యార్థిగా ప్రవేశించి నేడు సమాజంలో గుర్తింపు కలిగిన డాక్టర్‌గా ఎదిగారని తెలియజేశారు. ఈ సందర్భంగా సుమారు వంద మంది రక్తదానం చేశారు. అంతకుముందు చైర్ పర్సన్ ఝాన్సీ లక్ష్మీబాయి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఆమె నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య ఏజీఎం లు నర్రా శ్రీకాంత్, వి.కొండరెడ్డి, కాలేజీ ఏజిఎం శ్రీరాములు, ఆర్ఐ వినయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వేమిరెడ్డి పట్ల ఇనగనూరి అభిమానం

వింజమూరు, మేజర్‌న్యూస్ : నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పట్ల వింజమూరు మండల పరిషత్ అధ్యక్షులకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. బుధవారం మాజీ సొసైటీ చైర్మన్ జూపల్లి రాజారావుతో కలిసి వేమిరెడ్డి చిత్రపటాలను ఇంచార్జి ఎంపీడీఓ రామాంజనేయులకు అందజేశారు ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో జరిగినమండల సర్వసభ్య సమావేశంలో పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తన సొంత నిధులతో ఎన్నో ప్రజోపయోగ సేవలతోపాటు ప్రజాసంక్షేమ కార్యక్రమాలను కూడా జిల్లాలో విరివిగా చేపడుతున్న గొప్ప నాయకుడని ఆయన నిరంతరం ప్రజాసేవ పరమావధిగా భావిస్తూ రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ తాను ఎక్కడ కూడా గతంలో తాను చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిలుపుదల చేయకుండానే ఎన్విరామంగా కొనసాగిస్తున్న అలాంటి దానగుణం కలిగిన మానవత్వం మూర్తిభవించిన గొప్ప వ్యక్తి వేమిరెడ్డి అని కొనియాడారు. అలాంటి నేత మనకు దొరకడం ఈ జిల్లా ప్రజల అదృష్టం అని భావించారు. ఆయన గౌరవార్థం వింజమూరు మండలంలోని గ్రామ సచివాలయాలు పంచాయతీ కార్యాలయాలు మండల స్థాయి కార్యాలయాలలో ఆయన చిత్రపటం పెట్టేందుకు మండల సమావేశంలో తీర్మానించడం సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఈ చిత్రపటాలను ఇన్‌చార్జ్ ఎంపీడీవోకు అందజేసి ప్రతి వలయం పంచాయతీ కార్యాలయం మండల కార్యాలయాలలో ఏర్పాటు చేయాలని కోరినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ మల్లికార్జున తదితరులు ఉన్నారు.



# ప్రతి ఇంటా స్వదేశీ వస్తువు.. బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమం



వింజమూరు, మేజర్‌న్యూస్ : వింజమూరులోని స్థానిక బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షులు అంబటి ఈశ్వర్‌రెడ్డి అధ్యక్షతన బీజేపీ నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న ఆత్మ నిర్బర్ భారత్ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి చేరేలా, కార్యక్రమాలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లా అధ్యక్షులు శ్రీపారెడ్డి వంశిధర్ రెడ్డి సూచనలు మేరకు మండలప్రవాస్ యోజన కార్యక్రమం జరిగింది ఈ సమావేశంకు మండలం ఇన్‌చార్జ్ మారెళ్ల బ్రహ్మరెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో ప్రతి ఇంటా స్వదేశీ వస్తువులే ఉండాలని, మన వస్తువులను మనమే అమ్ముకోవాలని సంకల్పతో భారత ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారన్నారుమన దేశంలో తయారయ్యే ప్రతి వస్తువులను ప్రోత్సహించాలని, తద్వారా అంతర్జాతీయ మార్కెట్‌లతో పోటీపడగలమనీ అన్నారు. మండలంలో ప్రతి ఇంటికి స్వదేశీ వస్తువు ల వాడకం గురించి తెలియజేసి ప్రతి ఇంటికిస్వదేశీ స్టిక్కర్ అతికించి వారి చేత స్వదేశీ వస్తువు వాడతా మని ప్రమాణం చేయిస్తా మన్నారు. దీని ద్వారా మన రాష్ట్ర, దేశ ఆర్ధిక వ్యవస్థ మరింతగా బలపడుతుందన్నారు. అనంతరం పట్టణంలోని పలు ఇండ్లు లోని వారికీ స్వదేశీ వస్తువుల ఉపయోగం గురించి వాటి ద్వారా వచ్చే ప్రయోజనాలు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయుకులు, మద్దూరి నాగేశ్వరావు, మల్లం కొండా రెడ్డి, దాసరి ప్రసాద్, రాంచంద్ర, మాదినేని నాగేశ్వరావు, గని రమణయ్య, నాగేంద్ర, వెంకట పతి, డి.నారాయణ రెడ్డి మండల, గ్రామ స్థాయి బీజేపీ కార్యకర్తలు సభ్యులు పాల్గొన్నారు.

# గాలికి పడిపోయిన పక్కా గృహాల పిల్లర్లు



నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ : గతంలో హౌసింగ్ చీఫ్ శివ ప్రసాద్ బినామి నిర్మాణా గృహాలలోనే కూలిపోయాయి. బీజేపీ నేత మిడతల రమేష్ మాట్లాడుతూ.. కేంద్ర నిధులతో హౌసింగ్ కార్పొరేషన్ నిర్మించిన గృహాలలో నాణ్యత లోపం వలన పగుళ్లు రావడం ఇప్పటివరకు చూసాం.. కావలి మెగా లేఔట్ లో పక్క పక్కనే ఉన్న రెండు గృహాల గోడలు తో బాటు పిల్లర్లు పడిపోయాయి.పిల్లర్లు కూలిపోవడం రాష్ట్ర చరిత్రలోనే మొదటి సంఘటనని బీజేపీ నేత మిడతల రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏకంగా పిల్లర్లు కూలిపోవడం అక్రమాలకు నిదర్శనం.గాభావిస్తున్నామన్నారు. హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ బినామిగా నిర్మాణాలు చేయించిన గృహాల పిల్లర్లు కూలిపోవడం ఆ అధికారి పని తీరుకు అద్దం పడుతుంది. నూతన ఎండి అధ్యయనం చేసి ఇప్పటినుండి అయినా పటిష్టమైన గృహాలు నిర్మించేల చర్యలు తీసుకోవాలని మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థికి జాతీయకరాటేలో తృతియస్థానం



ఆత్మకూరు, మేజర్‌న్యూస్ : ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థి ఏ.వరుణ్‌హేమంత్‌రెడ్డి విజయవాడలో జరిగిన 24వ జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి జాతీయస్థాయిలో తృతియస్థానం పొందాడు. కింగ్స్ మాస్టర్ లార్డ్ కరాటే అండ్ డ్యాన్స్ ఇన్సిట్యూట్ నిర్వాహకుడు ఉసురుపాటి రాంబాబు ఆ విద్యార్థికి తర్ఫీదునిచ్చాడని, విద్యార్థికి, మాస్టర్‌కు అభినందనలు తెలిపారు. హేమంత్‌రెడ్డి అండర్-14 విభాగంగా పాల్గొని ప్రతిభ చూపాడని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. స్థానిక వరుణ్‌కమ్యునికేషన్స్ అధినేత సంజీవరెడ్డి కుమారుడైన హేమంత్‌రెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయి, ఎంఈఓ సి.హెచ్.అనంతలక్ష్మి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు అభినందించి భవిష్యత్తులో మరింత ప్రతిభ చూపి వివిధ స్థాయిల్లో పతకాలు పొందాలని వారు ఆకాంక్షించారు.

# సోమనాథ, సాయిబాబా ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు

జలదంకి, మేజర్‌న్యూస్ : జలదంకి మండలం సోమవరప్పాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సోమనాథ స్వామి, శిరిడి సాయిబాబా ఆలయాల ప్రతిష్ఠ మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ప్రముఖ పారిశ్రామికవేత్త చేవూరు జనార్దన్ రెడ్డి, శ్రీమతి సులోచనమ్మ దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. గురువారం ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పవిత్రమైన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో భాగంగా గణపతి పూజ,



పుణ్యాహవచనం, అగ్ని ప్రణయనం, కుంభ అర్చన, విశేష రుద్ర హోమం, దేవి హోమం వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం బింబశుద్ధి, నవ కలశ స్నపనం, చతుర్దశ కలశ స్నపనం, క్షీరాధివాసం, జలాధివాసం వంటి కన్నులపండువైన క్రతువులు జరిగాయి. ముఖ్యంగా, స్వామివారికి నిర్వహించిన పాలాభిషేకం కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు. అలాగే విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైసీపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా షేక్ నాయిబ్ రసూల్



కావలి, మేజర్‌న్యూస్ : వైసీపీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్రంలో అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో యువజన విభాగాల్లో కమిటీలు నియమించడం జరుగుతుంది. అదే ప్రకారం కావలి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ముందు ఆలోచనతో ముస్లిం మైనార్టీలకు ప్రత్యేక స్థానం కల్పించేందుకు యువకుడు ఉత్సాహవంతుడు గతంలో కూడా వైసిపి పార్టీకి తన శక్తి వంచన లేకుండా కృషి చేసిన యువకుడు వైసీపీ పట్టణ ప్రధాన కార్యదర్శిగా షేక్ నాయబ్ రసూల్‌ను నియమించారు. అనంతరం పట్టణ ప్రధాన కార్యదర్శి నామీద నమ్మకంతో నాకు ఈ పదవి బాధ్యతలు అప్పుచెప్పిన కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి, పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి మరి నన్ను ప్రపోజల్ చేసిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ముస్లిం మైనార్టీలను పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని రాబోయే ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా చూడాలని తప్పకుండా వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి తప్పకుండా అవుతారని ప్రజల ఆశీర్వాదాలు ఉన్నాయని వారు తెలిపారు.

## ఆకట్టుకున్న వందేమాత గేయ రచయిత చిత్రం



చేజర్ల, మేజర్‌న్యూస్ : వందేమాతరం పాట రచించి రేపటితో 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా చేజర్ల హైస్కూల్ డ్రాయింగ్ మాస్టర్, ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ తోట కిషోర్ కుమార్ గీసిన చిత్రం అందరినీ ఆకట్టుకుంది. బంకిమ్ చంద్ర చటోపాధ్యాయులు 1875లో వందేమాతరం రచించి దేశభక్తి జ్వాలను రగిలించారు. స్వాతంత్ర ఉద్యమంలో ఈ పాట దేశమంతా ఆవేశం నింపగా, అనేకమంది స్వాతంత్ర సమరయోధులకు ప్రేరణగా నిలిచింది.భారత రాజ్యాంగ సభ 1950 జనవరి 24న వందేమాతరాన్ని జాతీయ గీతంగా ఆమోదించింది. 150 ఏళ్ల వేడుకల సందర్భంగా కళాకారుడు తోట కిషోర్ కుమార్ రూపొందించిన చిత్రం దేశభక్తి భావాలను ప్రతిబింబిస్తూ అందరి మనసులు దోచుకుంది.

## విత్తన శుద్ధితో అధిక ప్రయోజనాలు




ఉదయగిరి, మేజర్‌న్యూస్ : పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేపట్టాలని, విత్తనశుద్ధి అనేక ప్రయోజనాలు కలుగుతాయని శాస్త్రవేత్త సురేఖదేనన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు వ్యవసాయ సహాయ సంచాలకులు పార్లపల్లి చెన్నారెడ్డి ఆధ్యక్షతన ప్రోగ్రెస్ చాన్ ఫార్మర్స్ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. మట్టి పరీక్షల చేపట్టిన అనంతరం పంటల సాగు చేయాలన్నారు. మట్టి పరీక్షల్లో వచ్చే రకాలకు అనుగుణంగా ఎరువులు వాడాలన్నారు. లోతు దిక్కులు చేయడం ద్వారా పంటలను తెగుళ్లు, పురుగుల నుంచి కాపాడుకోవచ్చున్నారు. వ్యవసాయ అదికారుల సూచనలు సలహాలు పాటిస్తూ పంటల సాగులో యాజమాన్య పద్దతులు పాటించి పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి రామ్మోహన్, ఉద్యాన శాఖాధికారి జయశ్రీ, ఏఓలు మదన్మోహన్, సునీ భాస్కర్, కవిత, ఏఈవో భోగ్యం సుధీర్ కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ఉదయగిరి, మేజర్‌న్యూస్ : మండలంలోని గండిపాళెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం జీఎంకే ట్రస్టు అధినేత, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి వితరణ చేసిన నోట్ పుస్తకాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన నోట్ పుస్తకాలు సరిపోకపోవడంతో జీఎంకే ట్రస్టు ఆధ్వర్యంలో నోట్ పుస్తకాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఇప్పటికే ట్రస్టు ఆధ్వర్యంలో బ్యాగులు, రవాణా సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని పాఠశాలకు, తల్లిదండ్రులకు మం చిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు వెంకటేశ్వర్లు, కాశయ్య, ఉపాధ్యాయు లు తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుడు చెంతకు సత్యదేవుడు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** అన్నవరం రత్నగిరి నుంచి శ్రీ సత్యనారాయణ స్వామి వారు సామాన్యుడు చెంతకు సింహపురి కార్తీక దీపోత్సవ సమితి ఆధ్వర్యంలో లోక కళ్యాణార్ధం జరుగుతున్న మహా కార్తీక దీపోత్సవంలో భాగంగా సింహపురి నగరానికి విచ్చేసి వ్రతాలు నిర్వహించుకున్నారు. దేశంలో అన్ని శుభకార్యాలకు జరుపుకునే శ్రీ సత్యనారాయణ స్వామి వారి వ్రతాన్ని ఆంధ్రప్రదేశ్ అన్నవరం సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం నుంచి అర్చక స్వాములు సాంప్రదాయ బద్ధంగా ఉత్సవమూర్తులతో నెల్లూరులో అత్యంత ఘనంగా నిర్వహించారు. సుమారు 600 మంది దంపతులు ఉచితంగా సత్యనారాయణ స్వామివారి వ్రతాలను జరుపుకొని అత్యంత మహా కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నారు. నెల్లూరు సింహపురి వైద్య సేవ సమితి ఆధ్వర్యంలో 150 మంది గిరిజన యానాది దంపతులు శ్రీ స్వామివారి వ్రతాలలో పాల్గొని తరించారు. జీవితంలో దర్శనానికి నోచుకోని పేదవారి కోసం శ్రీ స్వామివారి కృపాకటాక్షములతో నెల్లూరులో సదరు భక్తులకు దర్శనభాగం, వ్రతభాగ్యం కల్పించడం శ్రీ స్వామివారి కృప అని స్వర్ణ భారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ అన్నారు. నెల్లూరు చెరువు గణేష్ ఘాట్ నందు గురువారం సత్యనారాయణ స్వామి వ్రతాలను దీపా వెంకట్ దీపారాధ సత్యనారాయణ స్వామి పూజలు ప్రారంభించి నిర్వహించారు. సింహపురి దీపోత్సవ సమితి కార్యకర్తలను అభినందించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్ చౌరవతో ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించి నట్లు తెలిపారు. అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్, కార్యనిర్వహణాధికారి వేర్ల సుబ్బారావు సూచనల మేరకు దేవస్థానం సిబ్బంది పర్యవేక్షణ అధికారి పప్పుల వెంకట రమణ, ఎం.నాగేశ్వరరావు జూనియర్ అసిస్టెంట్, దిలీప్, స్పెషల్ గ్రేడ్ వ్రత పురోహితులు చామర్తి కన్నబాబు సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో ఆనం శుభకర్‌రెడ్డి దంపతులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి దంపతులు, సింహపురి కార్తిక దీపోత్సవ సమితి అధ్యక్షులు డాక్టర్ కె.వెన్నెల, కార్యదర్శి భయ్యా మల్లిక, ఉపాధ్యక్షులు-కోడూరు జయప్రద, సరిత, ముక్కాల వ్యాస ప్రసాదు, కోడూరు జయరాం, పి.సత్యనాగేశ్వరరావు, హర్షవర్ధన్, మధుసూదన్‌రెడ్డి, కామేశ్వరరావు, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాపూరులో తప్పని ట్రాఫిక్ సమస్యలు




**రాపూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన రాపూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకు అధికమవుతున్నాయి. పట్టణంలో 565 జాతీయ రహదారి నిర్మించిన నేపథ్యంలో అటు ఇటువైపు వాహన రద్దీ రోజురోజుకు పెరిగిపోతుంది. దీనికి తోడు పట్టణంలోని ద్విచక్ర వాహనదారులు, కొన్ని నాలుగు చక్రాల వాహనాలు రోడ్లపైన ఎక్కడపడితే అక్కడ ఆపివేయడంతో ట్రాఫిక్ చిక్కులు వస్తున్నాయి. స్థానిక పోలీసులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్న కూడా ప్రజల్లో ఎటువంటి మార్పు రాకపోవడం గమనార్హం. దీంతో అక్కడక్కడ చిన్నచిన్న ప్రమాదాలతో పాటు పెద్దపెద్ద యాక్సిడెంట్లు జరిగిన నేపథ్యం కూడా ఉంది. ముఖ్యంగా రోడ్డు వెంబడి ఉన్న దుకాణదారులు వారి వారి వస్తువులను నడిరోడ్డుపైనే పెట్టుకోవడం దీంతో అంగలకు వచ్చేవారు వారి వాహనాలను రోడ్డుపక్కనే నిలిపివేయడంతో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వ్యాపారస్తులు వారి స్వలాభం కోసం వస్తువులను రోడ్డుపై పెట్టడంతోనే ట్రాఫిక్ సమస్య వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. పట్టణంలో ఉన్న చిన్న రోడ్లుపైనే వస్తువులు ఉండటం ట్రాఫిక్ సమస్య పెరిగిపోవడమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక పోలీసులు ప్రధాన జాతీయ రహదారి తోపాటుగా రోడ్లపైన అక్రమంగా అడ్డంగా పెట్టి ఉన్న వస్తువులను క్లియర్ చేసి ప్రజలకు మంచి ట్రాఫిక్ వాతావరణం కల్పించవలసిందిగా రాపూరు పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# విఎస్‌యూలో తెలుగు భాషా జాతీయ సదస్సు ముగింపు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (విఎస్‌యూ) తెలుగు శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సం యుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు భాషా పరిరక్షణ, పరిశోధన, పరివ్యాప్తి జాతీయ సదస్సు గురువారం విజయవంతంగా ముగిసింది. సమా పన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప కులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లా డుతూ.. తెలుగు భాష మన సంస్కృతికి ప్రతి బింబం. భాష పరిరక్షణ అంటే అక్షరాల పరిరక్షణ మాత్రమే కాదు, ఆ భాషలోని భావం, ఆత్మ, సంస్కృతిని కాపాడటం కూడా మన బాధ్య త అని పేర్కొన్నారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణ చందు మాట్లాడుతూ.. 'తెలుగు భాష విశాల సముద్రం. దానిలోని విలువైన ముత్యాలను కను గొని కొత్త తరాలకు అందించాలి. పాత పాఠ్యాల సేకరణతోపాటు వాటిని ఆధునిక దృష్టికోణంలో పునర్మూల్యాంకనం చేయడం అవసరం అని అభి ప్రాయపడ్డారు. దేశంలోని పలు విశ్వవిద్యాల యాల ప్రొఫెసర్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని పత్రాలు సమర్పించారు. భాషా పరిణా మం, సాహిత్య వైవిధ్యం, భాషా సాంకేతికత, ప్రజా సంస్కృతి, భాషా బోధనలో సవాళ్లు వంటి అంశాలపై చర్చలు జరిగాయి. సదస్సు నిర్వహణ లో ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మైల త్యాగరాజు సంచాల కులుగా, డాక్టర్ రాజారామ్ కన్వీనర్‌గా, డాక్టర్ తెలిదేవులపల్లి విమల, డాక్టర్ వి.వెంకటేశ్వర్లు కో కన్వీనర్లుగా వ్యవహరించారు. విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రుణాలు మంజూరుపై కమిషనర్ సమీక్ష



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో నిర్మింపబడి ఉన్న టిడ్కో గృహములకు సంబంధించిన అల్లిపురం, వెంకటేశ్వరపురం, మొదలగు లేఅవుట్లలోని లబ్ధిదారులకు కేటాయించబడిన గృహాలకు వివిధ కారణాలతో రుణాలు మంజూరు కాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు ప్రైవేటు బ్యాంకుల ద్వారా లోను మంజూరు చేసి, వారికి టిడ్కో గృహాలను అందజేయాలని అన్నారు. ఈ సందర్భంగా గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో కమిషనర్ వైఓ నందన్ ఆధ్వర్యంలో రుణాలు మంజూరు చేయు విషయముపై సమీక్షను నిర్వహించారు. ఈ సమావేశంకు డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఈజీ హెూమ్స్ బ్యాంకు సిబ్బంది, మెప్మా సిబ్బంది, డీసీఓ కార్పొరేషన్ హౌసింగ్ సిబ్బంది హాజరైనారు.

## తుపాను చేనేత బాధితులకు చేయూత

● బియ్యం, నిత్యావసర వస్తువులు పంపిణీ



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మొంథా తుపాను బాధితులకు సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని బిరదవోలు పంచాయితీ కళ్యాణపురం గ్రామంలో చేనేత కార్మికులకు టీడీపీ మండల రైతు అధ్యక్షులు యత్తపు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మొంథా తుఫాను కారణంగా మగ్గం గుంటలోకి నీరు చేరి, చేనేత చేయుటకు వీలులేని పరిస్థితి వున్న ఒక్కో కుటుంబానికి బియ్యం-50 కేజీలు, కందిపప్పు-1 కేజీ, చక్కెర-1 కేజీ, పామాయిల్-1లీ, బంగాళదుంపలు-1 కేజీ, ఆనియన్స్-1కేజీ చొప్పున లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నపూస రమణారెడ్డి, వెన్నపూస కృష్ణారెడ్డి, కేతు మల్లికార్జునరెడ్డి, వీఆర్ఓ మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

## మూలపేట శివాలయంలో కార్తీక లక్ష దీపోత్సవం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** మూలపేటలోని పవిత్రమైన కార్తీక మాసంను పురస్కరించుకుని, మూలపేటలోని శ్రీ శివాలయంలో బుధవారం జరిగిన లికార్తీక లక్ష దీపోత్సవంలి ఆధ్యాత్మిక వాతావరణంలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ పవిత్ర కార్యక్రమానికి జనసేన పార్టీ సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ కుటుంబం ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో దీపోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా భక్తుల కోసం పూలంగి సేవ నిర్వహించబడగా, అనంతరం లిలితీర్థ ప్రసాదాలను పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు పంపిణీ చేశారు. భక్తి ఉత్సాహంతో నిండిన ఈ లక్ష దీపోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొని శివనామ స్మరణతో దీపాలు వెలిగించారు. ఉభయకర్తలైన నూనె మల్లికార్జున యాదవ్ కుటుంబ సభ్యులను ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ప్రత్యేకంగా లిలిఅభినందించి ఆశీర్వదించారు. కార్తీక మాసంలో దీపం వెలిగించడం మహాపుణ్యఫలాన్ని ఇస్తుందనే విశ్వాసంతో భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొనడం విశేషమన్నారు.

# రైతులకు యూరియా కొరత లేదు : టిడిపి నాయకులు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో రైతులకు యూరియాకొరత లేదని ఆత్మకూరు సిండికేట్ రైతుసేవాసహకారసంఘ చైర్మెన్ పరిటాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఆయన గురువారం తెలుగుదేశం నాయకులతో కలిసి తమ సొసైటి వద్ద రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. యూరియా కొరత అనే ప్రచారం సత్యదూరమని, ప్రతిరైతుకు ప్రతి పంటకు సీరియల్ నెంబర్ ప్రకారం ఒక్కో బస్తా యూరియా అందజేస్తామన్నారు. పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు రైతులకు అవసరమైన మేరకు యూరియా సమకూరుస్తున్నారని వారికి ధన్యవాదాలు తెలిపారు. ఏరైతు కూడా యూరియాలేదని దిగులు చెందరాదని, అవసరం మేరకు సరఫరా చేయిస్తామని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గ తెలుగుదేశం సీనియర్ నాయకుడు కేతా విజయభాస్కరరెడ్డి ప్రసంగిస్తూ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ముందస్తు జాగ్రత్తలు, చర్యలతో రైతుల అవసరానికి తగినవిధంగా యూరియా వచ్చేలా చేశారన్నారు. ఆర్ఎస్‌కెల



ద్వారా, సొసైటీలద్వారా రైతులకు అవసరం మేరకు యూరియా అందేలా చూస్తామని విజయభాస్కరరెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సొసైటి ఎండి శ్రీనివాసులు, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లు నాయుడు, పట్టణ టిడిపి ప్రధానకార్యదర్శి తోడేటి వెంకటయ్య, స్థానిక జిల్లా ప్రభుత్వవైద్యశాల డైరెక్టర్ పొన్నం శ్రీరాములు, కౌన్సిలర్ గంధళ్ళ వేణు, తెలుగుయువత అధ్యక్షుడు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కొండ బిట్రగుంట హరిజనవాడ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైంది. అదే గ్రామానికి చెందిన ఉదయగిరి శ్రీనివాసులు కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి, కొద్దిసేపట్లోనే మొత్తం ఇల్లు మంటల్లో చిక్కుకుంది. ఇంట్లో ఉన్న బీరువాలు, నగదు, గృహోపకరణాలు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు నీటితో మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా అప్పటికే ఇల్లు పూర్తిగా దగ్ధమైపోయింది. ఈ సంఘటన విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి గురువారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే అధికారులు గ్రామ పెద్దలతో కలిసి దగ్ధమైన ఇంటిని పరిశీలించి, జరిగిన నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇలాంటి దురదృష్టకర ఘటనలో కుటుంబానికి జరిగిన నష్టాన్ని ప్రభుత్వం గుర్తించి, సహాయం అందించేలా చర్యలు తీసుకుంటాం. కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటుందని భరోసా ఇచ్చారు.

# బీజేపీ సీనియర్ నాయకుడు అన్నం శ్రీనివాసులు కన్నుమూత

- శోకసంద్రంలో తోటపల్లి గూడూరు మండలం, నరుకూరు
- నివాళులర్పించిన ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సురేష్ రెడ్డి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** తోటపల్లి గూడూరు మండలం నరుకూరు గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు అన్నం శ్రీనివాసులు ఈరోజు అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మరణవార్త తెలిసిన వెంటనే స్థానికంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు భారీగా తరలి వచ్చి నివాళులర్పించారు. మృతుడు అన్నం శ్రీనివాసులు పార్టీ పట్ల కట్టుబాటుతో, సేవాభావంతో పనిచేసిన నాయకుడిగా బిజెపి శ్రేణుల్లో గౌరవాన్ని సంపాదించారు. ఆయన ప్రాంతీయ ప్రజల అభ్యున్నతికి, పార్టీ బలోపేతానికి విశేషంగా కృషి చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ రీజనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి స్వయంగా నరుకూరు గ్రామానికి వెళ్లి మరణించిన శ్రీనివాసుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పి, 'శ్రీనివాసులు పార్టీకి, ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయాలు. మీరు ధైర్యంగా ఉండండి, మేమంతా మీతోనే ఉన్నాం' అని అన్నారు. పార్టీ తరఫున ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. స్థానిక ప్రజలు, బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు. గ్రామం మొత్తంలో విషాదఛాయలు నెలకొంది.

# నవంబర్ 20న చలో ఢిల్లీ కార్యక్రమం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ నవంబర్ 20న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని అంబేద్కర్ భవన్లో మాల మహానాడు ఆధ్వర్యంలో వివిధ దళిత సంఘాల రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి చేయడం సమంజసం కాదన్నారు. ఇది దళితుల మనోభావాలను దెబ్బతీసిందన్నారు. ఎక్కడైతే దళితులకు అన్యాయం జరిగిందో అక్కడ ఆత్మగౌరవాన్ని చాటి చెప్పేందుకు పెద్ద ఎత్తున నవంబర్ 20న చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బెల్లంకొండ గోపి మాదిగ, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పందింటి సుబ్బయ్య మాదిగ, కోలగట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు

## వెంకటేశ్వర స్వామి సన్నిధిలో..

# కార్తీక దీప కాంతులు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మాగుంట లేఔట్ లోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం నందు కార్తీక మాసం సందర్భముగా భక్తులు గురువారం ఉదయం నుండి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. భక్తులు భారీగా తరలివచ్చి ఉదయం నుండి కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని స్మరించుకున్నారు. అనంతరం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించి శ్రీవారిని దర్శించి తరించినారు. దేవస్థానం వారు భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసి వారికి తీర్థప్రసాదాలు అందించినారు.



# గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి : ఎంపీపీ కేతా



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపిటిసి, జెడ్పిటిసి సభ్యులు, వార్డుమెంబర్లు, అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో కృషిచేయాలని ఆత్మకూరు మండలాధ్యక్షుడు, జిల్లా మండలాధ్యక్షుల సంఘ అధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డి కోరారు. గురువారం ఆత్మకూరు మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆత్మకూరు, ఏఎస్‌పేట, అనంతసాగరం, సంగం, చేజర్ల, కలువాయి, మర్రిపాడు, కలిగిరి, ఉదయగిరి, సీతారామపురం మండలాలలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపిటిసి మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులకు సుస్థిర స్థానిక అభివృద్ధి లక్ష్యాల అంశంపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మండలాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. తొలుతగా మహాత్మాగాంధీజీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఎంపిడివో రఫీఖాన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపిడివో రఫీఖాన్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ శిక్షణా కార్యక్రమంలో ఎంపీపీ కేతావేణుగోపాల్‌రెడ్డి ప్రసంగిస్తూ ప్రభుత్వం ఎంతో ఉన్నతాశ్యంతో, ప్రజల కోసం గ్రామాల అభివృద్ధి సత్వరమే జరగాలన్న లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈకార్యక్రమంలో శిక్షణ పొందేవారంతా గ్రామీణాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి, ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. గ్రామాలు సమగ్రఅభివృద్ధి సాధిస్తేనే ప్రజలు సంతోషంగా ఉంటారని, మండలాలు, జిల్లాలు, రాష్ట్రం, దేశం పరిపుష్టిగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యసాధనకు ప్రజాప్రతినిధులుగా ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు, వారితోపాటు విధులు నిర్వహించాల్సిన అధికారులు, సిబ్బంది కృషిచేయాలని, ప్రజాప్రతినిధులు తమ వంతు బాధ్యతగా భావించాలని, రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరచాలని, అన్ని గ్రామీణ ప్రాంతాలు సమగ్ర అభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో ప్రత్యేకంగా ప్రభుత్వం భావిస్తుందని, ఆత్మకూరు నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని, అన్నివర్గాలకు సంక్షేమఫలాలు అందాలన్న సంకల్పంతో స్థానిక శాసనసభ్యులు, రాష్ట్రదేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేకంగా పట్టుదలగా కృషిచేస్తున్నారని వేణుగోపాల్‌రెడ్డి పేర్కొంటూ



తదనుగుణంగా స్థానిక ప్రజాప్రతినిధులు వ్యవహరించాలని ఆయన కోరారు. ఎంపిడివో రఫీఖాన్ మాట్లాడుతూ.. 2030నాటికి గ్రామ పంచాయతీల్లో పేదరికంలేని జీవనోపాధి, ఆరోగ్యపంచాయతీ, ప్రతి ఇంటికి నాణ్యమైన త్రాగునీటి సరఫరా, మహిళాసాధికారత, బాలబాలికల స్నేహపూరితం, పర్యావరణ స్నేహపూరితం అనే 9అంశాల లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం రూపొందించి ఆమేరకు రెండు రోజులపాటు శిక్షణా కార్యక్రమం రూపొందించగా అమలు చేస్తున్నామన్నారు. అందరూ లక్ష్యసాధనకు తమవంతుగా కృషిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి రమణయ్య, డిప్యుటి ఎంపిడివో భువనేశ్వరిలు పాల్గొనగా జిల్లా శిక్షణావనరుల కేంద్రి ప్రతినిధి మహ్మద్ జిలానీబేగ్, మహిమలూరు, అనంతసాగరం పంచాయతీ కార్యదర్శులు విజయ్, నరశింహులు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో 9మండలాల స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను సహాయం అందని చేనేత కుటుంబాలు

- చేనేత జౌళి శాఖ అధికారి బాలసుబ్రమణ్యంకి వినతి
- చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ

**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా రూరల్ నియోజకవర్గం రెండవ డివిజన్ నారాయణ రెడ్డి పేటలో 600 చేనేత కుటుంబాలు చేనేత వృత్తి మీద ఆధారపడి మగ్గాల మీద చేనేత వస్త్రాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉపృత్తులు మీద మరొక 500కుటుంబాలు నేత పని చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నారు. గత నెల రోజులుగా భారీ వర్షాలు, తుఫాను తీవ్రతకు చేనేత కుటుంబాలు పూర్తిగా పని కోల్పోయారు. మగ్గం మీద ఉండే నూలు వర్షము కారణంగా పూర్తిగా తడిచిపోయింది. మగ్గం గుంటలో నీరు చేరింది. ఈ తుఫాను వల్ల నెల రోజులు చేనేతలు పనికి దూరమైయ్యారు. ఈ తుఫానుకు ఇబ్బందబడ్డ చేనేత కుటుంబాలకు ప్రభుత్వం తాత్కాలిక సహాయంగా 50 కేజీల బియ్యం, కొన్ని పలసరుకులు అందజేస్తుంది. ఈ తాత్కాలికి సహాయంలో నారాయణరెడ్డిపేటలో గల 600కుటుంబాలకు గాను 160 చేనేత కుటుంబాలకు మాత్రమే సహాయం అందింది. నిజమైన మగ్గం కలిగిన చేనేత కార్మికులకు తాత్కాలిక సహాయం అందలేదు. ఈరోజు చేనేత జౌళి శాఖ అధికారులను నెల్లూరు స్టోన్ హౌస్ పేటలో గల వారి కార్యాలయంలో కలిసి సమస్య తెలియజేశారు. నిజమైన కార్మికులకు ఎందుకు సహాయం అందలేదని అడగగా అధికారులు మాకు



సచివాలయం సిబ్బంది సరైన నివేదిక అందజేయలేదని సమాధానం చెబుతున్నారు. చేనేత జౌళీ శాఖ కార్యాలయ అధికారులు వద్ద నెల్లూరు జిల్లాలో ఉండే చేనేత మగ్గాల డేటా లేదు అని సమాధానం చెబుతున్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి పేదలు, నిరుపేదలు ఎక్కువగా చేనేత వర్గములో ఉన్నారు. వారు చేసే పనికి సరైన గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై అధిక వడ్డీలు కట్టలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. తమరు దయవుంచి వెంటనే చేనేత కుటుంబాలకు తుఫాను సహాయం జిల్లాలో ఉండే 4వేల కుటుంబాలకు, 5వేల కుటుంబాలు కుటుంబాలు ఉపృత్తులు వారికి అందేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ తాళ్ల నరసింహస్వామి, ఐకా నాగేశ్వరరావు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాల స్థితిగతులపై జనసేన కిషోర్ ఆరా



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ ఎంపీడీఓని వారి కార్యాలయంలో కలిసి చెత్త నుంచి సంపద సృష్టించే కేంద్రాల వివరాలను జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ కోరారు. అట్టడుగు గ్రామాల నుంచి అభివృద్ధి సాధించి మహాత్ముల సంకల్పం గ్రామ స్వరాజ్యం సాధించడమే పవన్ కళ్యాణ్ లక్ష్య మన్నారు. పవన్ కళ్యాణ్ చారిత్రాత్మక నిర్ణయాలతో పంచాయతీ వ్యవస్థలో మార్పులు అభివృద్ధి దిశగా రాష్ట్రం అడుగులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చొరవతో 9.6 కిలోమీటర్లు మేర 217 విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేసి 17 కుటుంబాలు ఉన్న గిరిశిఖరాన ప్రతి ఇంటికి ఐదు బల్బులు, ఒక ఫ్యాను ఏర్పాటు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు ఆయన మాట్లాడుతూ.. రూరల్‌లో చెత్త నుంచి సంపద సృష్టించకరల్సిన కేంద్రాలు ఎన్ని అవసరం ఉంటే ఎన్ని పూర్తయి ఉన్నాయి. మరెన్ని నిర్మాణం కావాల్సి ఉంది. అదేవిధంగా క్లాప్ మిత్ర సభ్యులు చెత్త సేకరించేందుకు, అదేవిధంగా కంపోస్ట్ చేసేందుకు ఎంతమంది అందుబాటులో ఉన్నారు. ఇంకా ఎంతమంది ఆవశ్యకత ఉందనే వివరాలను తెలియజేయాలని అభ్యర్థన సమర్పించారు. చెత్త నుంచి సంపదని సృష్టించే మహత్తర కార్యక్రమానికి కూటమి నాయకులు శ్రీకారం చుట్టారని అందులో భాగంగా మున్సిపల్ శాఖా మాత్యులు పొంగూరు నారాయణ, నెల్లూరు రూరల్ ఫ్యాక్టరీ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. మారుమూల ప్రాంతాలను సైతం అభివృద్ధి పథంలో నడిపిస్తూ ఏ ఆశయంతో అయితే జనసేన పార్టీ ఆవిర్భవించిందో ఆ లక్ష్యాలను వ్యూహాత్మకంగా పవన్ కళ్యాణ్ చేదిస్తున్నారని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధికి అవసరమైన ప్రదేశాల్లో జనసైనికులు అందరూ కూడా స్వచ్ఛందంగా వాలంటీర్లువలే పనిచేస్తామని తెలిపారు.

# వర్షాలకు అరటిపంట నష్టం

- గిట్టుబాటుధర మృగ్యం
- కుదేలయిన అరటిరైతు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మెట్టప్రాంతమైన ఆత్మకూరులో ఆలూరి వెంకటేశ్వర్లు అనేరైతు సాహసంచేసి తన పొలంలో అరటిసాగు చేయగా గిట్టుబాటు ధరలేక విలవిలలాడుతున్న తరుణంలో మూలిగేనక్కపై తాటికాయపడ్డచందంగా ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కాయలు రాలిపోవడం, చెట్టు విరగడం, కాయలు కుళ్ళిపోవడంతో ఆరైతు కుదేలయ్యాడు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఆలూరు వెంకటేశ్వర్లు అనే రైతు 4.20 ఎకరాల్లో అరటి సాగుచేశాడు. రేయింబవళ్ళు శ్రమించాడు. దాదాపు 10లక్షల రూపాయల పెట్టుబడి పెట్టాడు. దిగుబడి బాగుందని ఆయన భావిస్తున్న తరుణంలో మార్కెట్‌లో ఒకకిలో అరటి 16రూపాయలుంటూ ఆరు రూపాయలకు దిగజారింది. దాంతో ఆయన దిగాలు చెంది ఉండగా అంతోలనే ప్రకృతివైపరీత్యం ఆయన్ను చుట్టుముట్టింది. పొలంలో అరటి చెట్లు విరిగిపడడం, కాయలు రాలిపోయి కుళ్ళి పోవడంతో ఆయన తీవ్రంగా మనస్థాపానికి గురై ఇంతటి నష్టం ఎలా భరించాలన్న వేదనచెందసాగాడు. తనగోడును







ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నాయకులు మూలివెంగయ్య, లక్కు కృష్ణప్రసాద్ తదితరులకు విన్పించగా వారు గురువారం ఆ అరటితోటను పరిశీలించారు. వ్యవసాయ, ఉద్యానవన అధికారులు పండ్లతోటలకు నష్టపరిహారం ఇవ్వలేమన్నారని ఆ రైతులు పేర్కొన్నారు. రైతుసంఘ జిల్లా కార్యదర్శి మూలివెంగయ్య, సహాయకార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్‌లు అరటితోటను పరిశీలించి ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళతామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా రైతుసంఘ నాయకులు మాట్లాడుతూ.. ఆత్మకూరు నియోజకవర్గంలో వెయ్యి ఎకరాల్లో తుఫాన్‌ప్రభావంతో వరిపంట దెబ్బతిన్నదని, రైతులు నష్టపోతున్నారని, ఎకరాకు 35వేల రూపాయల పెట్టుబడులుగా పెట్టిన వరి రైతులకు ఎకరాకు 10వేల రూపాయల పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం దారుణంగా ఉందన్నారు. ఎకరాకు 3పుట్లు ధాన్యం లభిస్తుందని, దాదాపు 60వేల రూపాయలు రైతుకు లభిస్తాయని, అలాంటిది ప్రభుత్వం 10వేలరూపాయలు ఇస్తే ఎలా ఆ రైతులు కోలుకోగలరని వారు ప్రశ్నించారు. ప్రత్యేకంగా ఉద్యానవనపంటలు సాగుచేసి ప్రకృతివైపరీత్యాలతో ఆపంటలు దెబ్బతినందున ప్రభుత్వం ఆదుకోవాలని, అరటిరైతు ఆలూరు వెంకటేశ్వర్లుకు 10లక్షలరూపాయల పరిహారం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. లేదంటే ఆ రైతుకు ఆత్మహత్యే శరణ్యమవుతుందని వారు పేర్కొన్నారు.

# మేధావిద్యార్థినికి కరాటే పోటీల్లో ట్రోఫీ




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని మేధా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుతున్న ఎంవి జస్విత అనే విద్యార్థిని జాతీయకరాటే పోటీల్లో అత్యంత ప్రతిభ చూపి ట్రోఫీ కైవసం చేసుకుంది. విజయవాడలో నిర్వహించిన 24వ జాతీయకరాటే ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో జస్విత పాల్గొని ఆరెంజ్‌క్యాటగిరి కటా ఈవెంట్‌లో ప్రతిభ చూపి ప్రధమస్థానం సాధించింది. గురువారం స్కూల్ కరస్పాండెంట్ టీసీవీ సుబ్బయ్య జస్వితను అభినందించారు. ఆ విద్యార్థికి తర్ఫీదునిచ్చిన కరాటే మాస్టర్ రాంబాబును కూడా అభినందించారు. ఈ వయసులోనే విద్యతోపాటు క్రీడల్లో రాణిస్తున్న మూర్తిరాజు కళ్యాణ్ చక్రవర్తి 1ప్రవల్లికల కుమార్తె జస్వితను పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, వివిధ ప్రజాసంఘాల వారు అభినందించారు. జస్విత తల్లిదండ్రులైన కళ్యాణచక్రవర్తి, ప్రవల్లిక దంపతులకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

# ఆత్మకూరులో వైసీపీ కోటిసంతకాల సేకరణ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో మెడికల్ కళాశాలల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతకాలసేకరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. గురువారం 11వవార్డులో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి పిలుపు, స్థానిక మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశాలతో పట్టణ వైసిపి అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి సూచనలతో ఈ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణ బిసిసెల్ అధ్యక్షుడు తాటి బోయిన సురేష్ ఆధ్వర్యంలో నాయకులు గుడిచైతన్య, యస్థానిలు ఈకార్యక్రమం నిర్వహించారు. మెడికల్ కాలేజిలను ప్రవేటుపరం చేస్తే ప్రజలకు కలిగెడి నష్టాలను ప్రజలకు వారు వివరిస్తూ వారి నుండి సంతకాలను సేకరించారు.

# ప్రగతి స్కూల్ విద్యార్థికి కరాటే జాతీయట్రోఫీ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ప్రగతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన 7వతరగతికి చెందిన షేక్ ముస్టాక్ అనే విద్యార్థి కరాటేలో జాతీయస్థాయి ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకున్నారు. విజయవాడలో నిర్వహించిన 24వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ 2025 పోటీల్లో 45కెజిలకుమిటి విభాగంలో ఆ విద్యార్థి ట్రోఫీ పొందారు. గతంలో కూడా ఈవిద్యార్థి ట్రోఫీ పొందాడు. గురువారం ఆ విద్యార్థిని పాఠశాల కరసాప్వడెంట్ ఎస్.రామ్మోహన్‌రెడ్డి సన్మానించి అభినందించారు. విద్యతోపాటు ఆటలు, క్రీడల్లో మరింతగా ప్రతిభ చూపాలని, భవిష్యత్తులో మరిన్ని పతకాలను కైవసం చేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ముస్టాక్ ఇంతటి ప్రతిభ చూపేందుకు కారుకులైన కరాటే మాస్టర్ ఉసురుపాటి రాంబాబును కూడా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొని ఇస్టాక్‌ను అభినందించారు.

# అయ్యప్ప భక్తులకు అన్నసంతర్పణ



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం శివాలయం నందు అయ్యప్ప భక్తులకు అన్నసంతర్పణ చేశామని అయ్యప్ప భక్తుడు హరి (సీవీఆర్‌అయ్యప్ప భక్తులు) తెలిపారు. సుమారు 250 మందికి అన్నదానం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులు ధన్యవాదాలు తెలిపారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు : కమిషనర్

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఆప్కాస్ విధానంలో డ్రైవర్లుగా విధులు నిర్వహిస్తున్న వారు అత్యంత క్రమశిక్షణను పాటించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం కనబరిస్తే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని కమిషనర్ వైఓ నందన్ హెచ్చరించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో డ్రైవర్లతో సమీక్ష సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థలో చెత్త సేకరణ వాహనాలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల డ్రైవర్లతోపాటు కార్యాలయ వివిధ విభాగాల అధికారులకు డ్రైవర్లుగా వ్యవహరిస్తున్న సిబ్బంది హాజరును క్రమం తప్పకుండా ఉన్నతాధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయానికి విధులలో చురుకుగా పాల్గొని కేటాయించిన విధులలో నిబద్ధత పాటించాలని



సూచించారు. దీర్ఘకాలిక గైర్హాజరు ఉన్నవారు, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న వారిని గుర్తించి తప్పనిసరిగా ఉద్యోగాల నుంచి తొలగించి వేస్తామని కమిషనర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఈఈ రహంతు జానీ, డీఈ రఘురామ్, సిబ్బంది పాల్గొన్నారు.

# చెత్త దిబ్బల తొలగింపు

## సూర్య కథనానికి స్పందన

సూర్య ఎఫెక్ట్

**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని పాతూరు నందుగల ఆనందలహరి పాఠశాల రహదారి మార్గంలో పేరుకుపోయిన **చెత్త పట్ల ఇలా ఉంటే రోగాలు రావా** శీర్షికతో కథనం ప్రచురితం కాగా పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి రహదారిలో ఉన్న చెత్తను ఆక్కడినుండి తొలగించి పరిశుభ్రతను ఏర్పాటు చేశారు ప్రస్తుతానికి విద్యార్థులకు కొంతమేర సౌకర్యాన్ని కల్పించినట్లయితే కాగా పూర్తిస్థాయిలో ఆ మార్గాన్ని పరిశుభ్రం చేసినట్లయితే విద్యార్థుల ఆరోగ్యానికి అలాగే పరిసర నివాసులకు ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.



# జలమయమైన ప్రధాన వీధులు

● మోకాటిలోతు నీళ్లలో పాదాచార్యులు తంటాలు ● రోడ్లపైనే కుళ్ళిన చెత్తాచెదారాలు

**రాపూరు, మేజర్‌న్యూస్ :** రాపూరు పట్టణంలో గురువారం కురిసిన వర్షాలకు ప్రధాన వీధులన్నీ జలమయం అయ్యాయి. వాతావరణ శాఖ ముందుగా హెచ్చరించిన ప్రకారం ఏపీ లోని పలు జిల్లాలకు వర్ష సూచనతో నెల్లూరు, కృష్ణా, ప్రకాశం, అనంతపురం, సత్యసాయి, కడప, అన్న మయ్య, చిత్తూరు, తిరుపతిలో మోస్తరు వానలు పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో వాతావరణంలో మార్పులు కారణంగా రాపూరు పట్టణంలో ఓ మోస్తారు జల్లులతో కూడిన వర్షం కురిసింది. పట్టణంలోని అన్ని ప్రధాన వీధులు జలమయం అయ్యాయి. దీంతో పాదాచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. బజార్ వీధి మొత్తం బురద మయంగా మారింది. మురుగు కాలవలు పూడిక తీయకపోవడంతో కాలువలలోని మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ దుర్గంధమైన వాతావరణం ఏర్పడింది. రోడ్లపైన చెత్త చెదరాలు అస్తవ్యస్తంగా పేరుకుపోవడంతో ఓవైపు పందులు మరోవైపు కుక్కలు స్వైర విహారం చేయడంతో దుర్గంధ భరితమైన కుళ్ళిన కంపుతో ప్రజలు నానావస్తులు పడుతున్నారు. కనీసం రాపూరు పంచాయతీ అధికారులు కానీ సిబ్బంది గానీ ఇటువైపు కన్నెత్తిచూసిన పాపానా పోలేదని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.



## మంత్రి లోకేష్‌కి స్వాగతం పలికిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి నియోజకవర్గం దగదర్తి మండలంలో మాలేపాటి కుటుంబసభ్యులను పరామర్శించుటకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ దగదర్తికి రావడంతో కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ముసునూరు టోల్ ప్లాజా వద్ద నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మంత్రి నారా లోకేష్‌ను కరచాలని చేయుటకు యువకులు కార్యకర్తలు పోటీపడ్డారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పులకరిస్తూ కొద్ది నిమిషాలు అక్కడ నాయకులతో చర్చించి అక్కడనుండి సున్నబట్టి వరకు కావలి ఎమ్మెల్యే నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అపురూప అద్వితీయం.. కార్తీక దీపోత్సవం



● గణపతి పూజ, గోపూజతో ప్రారంభమైన లక్ష దీపోత్సవం
● ప్రత్యేక ఆకర్షణగా శ్రీ పండరనాథ స్వామివార్ల ఆలయ నమూన, శ్రీ నాగేశ్వర జ్యోతిర్లింగం
● వీఆర్‌సీ ప్రాంగణంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాట్లు
● భక్తులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని వసతుల కల్పన

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే కార్తీక మాస లక్ష దీపోత్సవం వైభవంగా ప్రారంభమైంది. నెల్లూరు పార్ల మెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని విఆర్‌సి మైదానం లో నిర్వహిస్తున్న కార్తీక మాస లక్ష దీపోత్సవ కార్య క్రమం గురువారం ఉదయం శివ నామస్మరణల మధ్య గణపతి పూజతో ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పా టు చేసిన వేదికపై గణపతి పూజ నిర్వహించారు. అనంతరం శ్రీ నాగేశ్వర జ్యోతిర్లింగం. శ్రీ పండరనాథ స్వామివార్ల ఆలయ నమూన ఆలయాలను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా లక్ష దీపోత్సవ కమిటి సభ్యులు మాట్లాడుతూ.. గత 9 ఏళ్లుగా కార్తీక మాస లక్ష దీపో త్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న భక్తులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నా మన్నారు. భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేశామని వివరించారు. ఈ మూడు రోజులు దీపాలు వెలిగించి భగవంతుడి ఆశీర్వాదాలు పొందాలని ఆకాంక్షించారు. గురువారం సాయంత్రం



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనం, ఆకాశ దీపం, లక్ష దీపోత్సవ కార్యక్రమం, మహా శివునికి విశేష భస్మాభిషేకం, విశేష హారతులు జరిగాయి. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారంతో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 6, 7, 8 తేదీల్లో అత్యంత వైభవంగా కార్తీక మాస లక్ష దీపోత్సవంలో ప్రతి సంవత్సరం విష్ణువు, శివుడికి సంబంధించి ఒక్కొక్క ఆలయ నమూనాలను ఏర్పాటు చేస్తున్నామని, శ్రీ నాగేశ్వర జ్యోతిర్లింగం. శ్రీ పండరనాథ స్వామివార్ల ఆలయ నమూనాలతోపాటు భారీ శివాపర్వతుల విగ్రహాన్ని ఎర్పాటు చేశామన్నారు. కార్తీక మాసంలో వ్రతాలు, నోములతోపాటు దీపారాధ నకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రజలందరికీ విష్ణువు, శివుడి ఆశీసులు అందాలన్న ఉద్దేశంతో ఈ లక్ష దీపోత్సవాన్ని ఇంత ఘనంగా చేపట్టామన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యుల తో కలిసి విపిఆర్ ఫౌండే షన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టామని, భక్తులకు నూనె, వత్తులు, సహా దీపాలు ఇక్కడే అందిస్తా మని వివరించారు.

















